## నేడు జిల్లాకు తెలంగాణ బిసి కమిషన్ ప్రతినిధులు రాక

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమీషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 21 గురువారం రంగారెడ్డి జిల్లాకు విచ్చేయనుందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 21(గురువారం) జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమీషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. అనంతరం సాయంత్రం 4:30 గంటలకు పాత్రికేయులతో విలేకర్ల సమావేశం ఉంటుందని తెలిపారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

## నేతల కుటుంబాలను పరామర్శించిన చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి



నేతల కుటుంబాలను పరామర్శించిన చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి

**తాండూరు, నవంబరు 20, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంతో పాటు యాలాల మండలంలో పలు వురు నేతల కుటుంబాలను ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందరరెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాలాల మండలంలో మాజీ ప్రజా ప్రతినిధి శేరి చెన్నారెడ్డి స్వర్గస్తులైన విషయం తెలుసు కున్న మహేందర్‌రెడ్డి అగ్గనూరు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శిం చారు. అదేవిదంగా తాండూరు పట్టణంలోని మార్వాడి బజార్‌కు చెందిన పురుషోత్తం బూబ్ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యాన్ని ఇచ్చి ప్రగాడ సానుబూతి తెలిపా రు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిసిహెచ్ డాక్టర్ చంద్రశేఖర్

## వైద్యుల పనితీరు భేష్

### జిల్లా వైద్య విధాన పరిషత్ డాక్టర్ చంద్రశేఖర్

**చేవెళ్ళ, నవంబర్ 20, ప్రభాతవార్త** చేవెళ్ల ప్రభుత్వ అసుపత్రిలో పనిచేసున్న సిబ్బంది రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారని, చేవెళ్ల వైద్యుల పనితీరు బేష్‌గా ఉందని జిల్లా వైద్య విధాన పరిషత్ డిసిహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని డిసిహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ అకస్మికంగా తనిఖీ చేశారు. అసుపత్రిలోని వార్డులను పరిశీలించి, రోగులను వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అసుప త్రిలోని వైద్యుల వివరాలను అడిగితెలుసుకుని రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా వైద్య విధాన పరిషత్ డిసిహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. అసుపత్రిలో సిబ్బంది సకాలంలో విధులకు హాజరు అవుతూ రోగులకు వైద్య సేవలను అందిసున్నారన్నారు. అసుపత్రికి వస్తున్న ప్రజలకు ఏలాంటి ఆసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అసుపత్రికి వస్తున్న రోగులకు అన్ని రకాల సేవలను అందిస్తున్నారన్నారు. అసుపత్రిలో ప్రసూతి సేవలను అందించేందుకు గైనాకాలజీస్ట్ నిత్యం అందుబాటులో ఉంటున్నారన్నారు. అసుపత్రిలో నిత్యం వందలాది మంది వస్తున్నారని, వారికి అన్ని సౌకర్యాలు సమకుర్చు తున్నామన్నారు. అసుపత్రికి వైద్యులు సకాలంలో వస్తున్నారన్నారు. వైద్యులు నిరుపేదలకు వైద్య సేవలను అందిస్తున్నారని, వారు అందిస్తున్న సేవలను కోనియాడారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, గైనకాలజీస్ట్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుతో కంది పంట నాణ్యత

### వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తల సూచనలు



తాండూరులో పర్యటించిన శాస్త్రవేత్తల బృందం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కంది నాణ్యతను కాపాడుతూ కల్తీని నివారించడానికి బ్లాక్ చైన్ టెక్నాలజీని వాడాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్స్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు సూచించారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో భౌగోళిక గుర్తింపు పొందిన కంది పంటపై అధ్యయనం చేసేందుకు ఈ బృందం తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానాన్ని బుధవారం సందర్శించింది. ఈ బృందం కమిటీ సభ్యులు సౌమ్య వినయన్ నేతృత్వంలో పర్యటించి తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు చేసిన కృషిని అభినందించారు. ట్రస్టీ-ఓ-వన్ సంస్థ సీఈవో ప్రభర్ మిశ్రా, డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, కేరళకు చెందిన బిజినెస్ స్కూలు ప్రిన్సిపల్ ఎ ప్రొఫెసర్ టీకే విశ్వనాథన్, ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ పద్మావి, ప్రొఫెసర్ విష్ణు శ్రీరాజన్, మనోజ్ వెంబు, అజేయ్ ఎలమంచి తదితరులు తాండూరు పరిశోధనా స్థానాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. తాండూరు సెంటర్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుధాకర్ తాండూరు సాధించిన విజయాలను ఈ బృందానికి వివరించారు. తాండూరు కందికి లభిస్తున్న అనుకూల ధరల వల్ల రానున్న రోజుల్లో ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేందుకు కంది పంట ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ కంది పంట పోషక విలువల గురించి వివరించారు.

## అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు

### గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ నాయక్



పోలీస్‌లు అరెస్టు చేసిన గిరిజన నాయకులు

**బొంరాస్‌పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త :** లగచర్ల ఘటనపై గిరిజ ఎలతో మాట్లాడటానికి వెళుతున్న గిరిజన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అక్రమంగా అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, గిరిజనులకు అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు గిరిజనుల భూములు లాక్కోవడానికి కూడా వె ఎకాడటం లేదు. ఫార్మా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల లో దౌర్జన్యకాండ నిర్వహిస్తుందని అమాయక గిరిజన ప్రజలపై అక్రమ కేసులు పెట్టారు. కొడంగల్ నియోజకవర్గంలో ఎవరైతే ప్రజా సమస్య మీద పోరాటం చేస్తారో వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నుండి గిరిజన విద్యార్థి సంఘం జాతీయ రాష్ట్ర నాయకులు ఇందల్ రాథోడ్ వెంకట్ బంజారా లోకేష్ నాయక్ బాలాజీ నాయక్, శ్రీనివాస్ నాయక్ గిరిజనులపై కొడంగల్ లో జరుగుతున్నటువంటిది విషాద ఘటన అన్నారు. మాట్లాడటానికి వెళ్లిన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. రేవంత్ రెడ్డి పతనం మొదలైందని గిరిజన విద్యార్థి సంఘం నాయకులను ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేసేందుకు చాలా విధాలుగా ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ని అణచివేసే విధంగా గిరిజనులు చూస్తారన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట బంజారా అన్నారు. జాతీయ అధ్యక్షులు నిందలు రాథోడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షులు వెంకట బంజారా లోకేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో కలెక్టర్ తనిఖీలు

### అధికారుల గుండెల్లో హడలు
### నిద్ర మత్తు వీడుతున్న అధికారులు



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సి.నారాయణరెడ్డి కొద్దిరోజుల్లోనే ఒక ప్రక్క ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూనే తనకున్న కొద్దిపాటి సమయంలో జిల్లా పరిధిలోని ఆయా మున్సిపాలిటీలు, మండలాల్లో ప్రజా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ముమ్మర తనిఖీలను నిర్వహించడంతో ఆయా శాఖల అధికారుల్లో, సిబ్బందిలో కొంత వణుకు పుట్టిస్తున్నాడు. ఇన్నాళ్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన పలువురు కలెక్టర్లు కనీసం మూడు మాసాలకు ఒకసారైనా జిల్లాలోని క్షేత్రస్థాయిలో సందర్శించడం, పర్యటించడం, తనిఖీలు నిర్వహించడం కానీ చేసిన పాపాన పోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలనే జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి కొద్ది సమయంలోనే జిల్లాలో ప్రభుత్వ అధికారుల పని తీరుపై ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయనే దానిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లా ఆరోగ్య వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో కొనసాగుతున్న ఆసుపత్రుల పనితీరు, కనీస సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ఇస్తున్న మందులు, సిబ్బంది, అధికారులు, వైద్యుల పనితీరుపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయడంలో ముందువరుసలో ఎంపిక చేసుకున్నారు. ఇక రైతుల రుణమాఫీ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత రైతులకు అందిస్తున్న వ్యవసాయ సాగు విధానాలతో పాటు రైతులు పండిస్తున్న వరి ఇతర పంటల ధాన్యం కొనుగోళ్లు, మార్కెటింగ్ విధానాలపై సైతం ఆయన సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక ప్రాథమిక, ఉన్నత విద్యా విధానం ఉపాధ్యాయుల పనితీరు, విద్యా బోధనలో ప్రభుత్వ మండల స్థాయి అధికారులపై కూడా ఆయన ప్రాథమిక ఉన్నత పాఠశాలలను తనిఖీ చేస్తూ విద్యార్థులతో ఆయన ముఖాముఖీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన కలెక్టర్ సి. నారాయణరెడ్డి తనిఖీల కారణంగా జిల్లా ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల్లో విధులకు ఎగనామం పెడుతూ, టూర్ల పేరుతో కాలక్షేపం చేసే అధికారులకు సిబ్బందికి మును ముందు వారిపై జిల్లా కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారోననే భయం కూడా కొంత ప్రభుత్వ అధికారుల్లో గుబులు కొనసాగుతుంది. ఇలా నెలకు, వారానికి, ఆయా శాఖల అధికారులు కూడా జిల్లా కలెక్టర్ మాదిరిగా పర్యటిస్తే ప్రభుత్వ పథకాల పనితీరుపై అవగాహన వస్తుందని అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతుంది.

## కమిషనర్‌కు విపక్ష కౌన్సిలర్ల మద్దతు

### లీకు వీరునిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు
### కలెక్టర్ ముందుకు తాండూరు వ్యవహారం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డికి అధికార పక్షం కంటే విపక్షం నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న కమిషనర్‌ను కావాలనే కొందరు ఇంటి దొంగలు లీకులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తన ప్రాధాన్యతను తగ్గిస్తున్నారనే నెపంతో స్థానికుడైన మున్సిపల్ ఉద్యోగి పత్రికలకు లీకులు ఇస్తున్నారని మండిపడుతున్నారు. గడచిన ఐదేళ్లలో చాలామంది కమిషనర్‌లు పట్టుపని పది నెలలు కూడా పని చేయకుండానే సెలవుపెట్టి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఆరు నెలల క్రితం వచ్చిన కమిషనర్ విక్రమ్‌సింహా గతంలో ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి ప్రజల మన్నలు పొందారు. తాండూరులో స్థిరంగా విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొనడంతో బదిలీపై వచ్చేందుకు అధికారులు వెనకంజ వేశారు. ఎట్టకేలకు విక్రమ్ సాహసం చేసి తాండూరులో బాధ్యతలు చేపట్టారు. కొద్ది రోజుల వరకు ఆయనకు అధికార, విపక్ష పక్షాలు, సహచర ఉద్యోగులు, సిబ్బంది సహకరించారు. క్రమంగా ఆయనకు వ్యతిరేకంగా ఓ వర్గం సీరియస్‌గా పనిచేస్తోంది. కమిషనర్‌ను సాగనంపేందుకు ఫిర్యాదులు చేయిస్తున్నారు. ఇదే పనిగా మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కూడా ఓ రాయి వేశారని తెలిసింది. తనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కమిషనర్‌పై రుసరుస లాడుతున్నారని తెలిసింది. ఆయనను సాగనంపితే తనకు బాధ్యతలు అప్పగిస్తారనే ఆశతో చకచకా పావులు కదుపుతున్నారని సమాచారం. అయితే, విపక్ష పార్టీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి మున్సిపల్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారని రాజకీయవర్గాల సమాచారం. కమిషనర్ పనితీరు బాగుందని, ఆయన వచ్చిన తర్వాత శానిటేషన్ మెరుగు పడిందని వివరించారు. కార్మికుల వేతనాలలో ఎలాంటి కోతలు లేకుండా చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. 'మార్చాల్సింది కమిషనర్‌ను కాదు.. మున్సిపాలిటీనే ప్రక్షణాళన చేయాలి' అన్నారు. స్థానికుడైన ఓ ఉద్యోగి కొన్ని పత్రికలకు లీకులు ఇచ్చి కమిషనర్‌కు వ్యతిరేకంగా వార్తలు రాయిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఏళ్ల తరబడి ఇక్కడే తిష్టవేసిన సదరు ఉద్యోగిని సాగనంపాలని సదరు కౌన్సిలర్లు కోరారు. అవినీతికి రుచిమరిగిన సదరు ఉద్యోగిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. అతని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. కౌన్సిలర్ల ఫిర్యాదుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కమిషనర్ వ్యవహారమై కలెక్టర్ ప్రతీక్ జైన్ దృష్టికి తెచ్చారు. స్థానికంగా కొంతమంది అనుసరిస్తున్న తీరు కమిషనర్‌ను ఇబ్బందుల్లో పడేస్తున్నాయని సదరు కౌన్సిలర్లు వివరించారు. ఫిర్యాదు చేసిన ఆరుమందిలో ముగ్గురు మహిళా కౌన్సిలర్లు ఉన్నారు.

# అర్ధరాత్రి మట్టి దందా..!

### కొండన్నగూడలో అక్రమ మట్టి తవ్వకాలు
### బడా నాయకుల పేరు చెప్పి ప్రభుత్వ భూమిలో వ్యాపారం



జేసీబీ సహాయంతో ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్న దృశ్యం

**షాద్‌నగర్, నవంబరు 20 ప్రభాతవార్త :** రాత్రి అయ్యిందంటే చాలు ఆ గ్రామ శివారులో మట్టి తవ్వకాలు, రవాణా జోరుగా కొనసాగుతుంది. కొంత మంది వ్యక్తులు ఒక సమూహంగా ఏర్పడి అక్రమ మట్టి తవ్వకాలు చేసి దానిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మట్టి మాఫియా వ్యాపారులు ఏకంగా ప్రభుత్వ భూమినే టార్గెట్‌గా చేసుకొని బడా నాయకుల పేర్లు చెప్పుకుంటూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో జరుగుతున్న ఈ చీకటి దందా వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెం.53లో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి జేసీబీల సహాయంతో అక్రమ మట్టి తవ్వకాలు జరిపారు. పదుల సంఖ్య లో టిప్పర్ల ద్వారా తవ్వకాలు జరిపిన మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకోవడం వారికి అలవాటుగా మారింది. గతంలో కూడా గ్రామ శివారులో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు, రవాణా కొనసాగాయి. ప్రతిరోజు చీకటి పడిందంటే చాలు యథేచ్ఛగా మట్టిని తవ్వుతూ ఒక్కో టిప్పర్‌కు ఐదు నుండి ఆరు వేల రూపాయల ధరకు మట్టిని అమ్ముకుంటున్నారు. నియోజకవర్గంలోని షాద్‌నగర్, కొత్తూరు ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు కూడా ఇక్కడి నుండి మట్టి రవాణా కొనసాగుతుంది. కొత్తగా ఏర్పాటు చేసే వెంచర్లతో పాటు భవన నిర్మాణాలకు ఈ మట్టిని తరలిస్తున్నారు. మట్టి వ్యాపారం చేసే మాఫియా నియోజకవర్గానికి చెందిన బడా నాయకుల పేర్లు చెప్పి తమ దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రితో పాటు బుధవారం ఉదయం 9 గంటల వరకు మట్టి తవ్వకాలు జరుగు తున్నా అధికారులు వారిపై దృష్టి పెట్టక పోవడం గమనార్హం. అధికారులు కొండన్నగూడ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమితో పాటు అక్కడే ఉన్న పట్టా భూములను సందర్శిస్తే అసలు విషయం బయటపడుతుంది. అక్రమ మట్టి తవ్వకాల కారణంగా ఏర్పడిన భారీ గుంతలు వారికి దర్శనమిస్తాయి. ఇంత పెద్దఎత్తున మట్టి వ్యాపారం జరుగుతున్నా స్థానిక పోలీసుల కళ్లలో పడకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. మట్టి వ్యాపారుల ప్రగల్భాల కారణంగా అధికార యంత్రాంగం కూడా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు వెల్లడవుతున్నాయి. ఏకంగా ప్రభుత్వ భూమిలో గుంతలు తవ్వి మట్టిని తరలించుకుపోతున్నా అడిగేవారు లేరని సర్వత్రా విమర్శలు వెల్లడవుతున్నాయి.

## భావితరాల కోసమే 300 అడుగుల రోడ్డు

### రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం : కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



**మహేశ్వరం, నవంబర్ 20, (ప్రభాతవార్త):** విపక్షాలు అనవసరంగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం పరిచారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో హైదరాబాద్ లో చిన్న రోడ్డు ఉన్నా సరిపోయేది కానీ ప్రస్తుతం మహానగరంగా మారటంతో రోడ్లు, డ్రెయినేజీ, ట్రాఫిక్ సమస్య పెరిగి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆయన గుర్తు చేశారు. ఓ ఆర్ ఆర్ వేసేటప్పుడు విపక్షాలు అంత పెద్ద రోడ్డు ఎందుకని విమర్శలు గుప్పించారని ఆయన అన్నారు. కానీ నేడు ఓఆర్ఆర్ మీద వెళ్తున్న వెహికిల్స్ కు ఆ రింగ్ రోడ్డు కూడా సరిపోయే పరిస్థితి లేదని ఆయన చెప్పారు. అందుకే ఫోర్త్ సిటీకి భవిష్యత్ అవసరాల దృష్ట్యా 300 ఫీట్ల రోడ్డు వేసి దానిలోని మెట్రో రైలు మార్గం కూడా వేస్తామని ఆయన వివరించారు. ఈ బృహత్తర ప్రణాళిక వల్ల రైతులకు, ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు, లాభం చేకూరుతుందని ఆయన చెప్పారు. ఓ ఆర్ ఆర్ కు ఆర్ ఆర్ ఆర్ కు మధ్య ఫోర్త్ సిటీ మరో మహానగరం గా అవతరించడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. రైతన్నలు అధైర్యపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఎలాంటి నష్టం, ఇబ్బందులు ఉండవని ఆయన భరోసా ఇచ్చారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

## ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త :** విద్యార్థులకు చిన్నతనంలోనే గ్రంథాలయం అలవాటు చేయాలని జిల్లా గ్రంథాలయం చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయం బడంగ్‌పేట్‌లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంగి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. బడంగ్‌పేటలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్న వయస్సులోనే గ్రంథాలయం అలవాటు చేయాలన్నారు. సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, స్థానిక పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

## గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞాన వంతులు కావాలి

### తెలంగాణా రాష్ట్ర చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లాలో గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞాన వంతులు కావాలని తెలంగాణా రాష్ట్ర చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారము గ్రంథాలయ చైర్మెన్ అధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ భవనములో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జిల్లాలోని 17 గ్రంథాలయాలలో 3 లక్షల పదివేల పుస్తకాలు ఉన్నాయని, పుస్తక పఠనం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. గ్రంథాలయ పుస్తకాలు చదవడం వలన కొత్త విషయాలు తెలుస్తాయని, ఉన్నత స్తానానికి చేరుకోవడానికి తోడ్పడతాయని తెలిపారు. వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో అధ్యయనం చేసిన ఎంతోమంది మేధావులుగా పెద్ద ఉద్యోగస్తులుగా ఎదిగారని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా గ్రంథాలయం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కుడా పేరు ప్రఖ్యాతులు కలిగి ఉన్నదని అన్నారు. ఉపాధ్యాయులు గ్రంథాలయాలను విద్యార్థులు సందర్శించడం, పుస్తక పఠనం పైన అవగాహన కల్పించి వారు అలవాటు పడేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో గ్రంథాలయం ఏర్పాటు చేసుకునే అవసరమున్నదని, జిల్లాలోని అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి నిధులను సమకూరుస్తామని అన్నారు. మండలాలలో గ్రంథాలయాల ఏర్పాటుకు తెలంగాణా రాష్ట్ర శాసన సభ్యులతో కలిసి మావంతు కృషి చేస్తామన్నారు. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసారు. జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేష్‌రెడ్డి. లైబ్రరి సెక్రటరీ సురేష్‌బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రచార కళా యాత్రను ముమ్మరంగా నిర్వహించాలి : కలెక్టర్



ప్రచార కళా యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రజాపాలన ప్రచార కళా యాత్ర కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో మంగళవారము నుండి ప్రజా పాలన-విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి యేడాది గడుస్తున్న సందర్భంగా ఈ విజయోత్సవాలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ జెండా ఊపి ప్రజా పాలన విజయోత్సవాల ప్రచార కళాయాత్ర వాహనమును ప్రారంభించారు. విజయోత్సవాలలో భాగంగా జిల్లాలోని తెలంగాణ సాంస్కృతిక కళాకారులు నేటి నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతిరోజు 3 మేజర్ గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలు కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామ, మున్సిపల్ వార్డుల్లో విస్తృతంగా టీఎస్సెస్ కళాకారులు తమ ఆటా పాటలు, ద్వారా అవగాహన కల్పించడం ఈ కళా యాత్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ విజయోత్సవ కళా యాత్ర ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. జిల్లా లో కళాకారులు ప్రభుత్వం అమలు జరుపుతున్న పథకాలపై పాటలు పాడుతూ ప్రజా కళా యాత్రను ముందుకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎ.చెన్నమ్మ, సహాయ పౌర సంబంధాల అధికారి ప్రభాకర్, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, సాంస్కృతిక శాఖ కళాకారుల బృందం, జిల్లా పౌర సంబంధాల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..!

### శివాలయం ముందు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి



సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి

**తాండూరు, నవంబరు 20, ప్రభాతవార్త :** ఇచ్చిన మాట ప్రకారం తాండూరు పట్టణంలోని చెరువెంటీశ్వర దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి దేవాలయాన్ని సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు ప్రధాన రహాదారి నుండి దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఈశ్వరుని దేవాలయం ముందు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, కౌన్సిలర్లు అంతారం లలిత, ప్రబాకర్‌గౌడ్, సోమశేఖర్, మాజీ కౌన్సిలర్ వాలి శాంతుకుమార్, దేవాలయ కమిటి సభ్యులు జొన్నల బస్వరాజ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బంటు వేణు తదితరులు పాల్గొన్నారు.

## పశురక్త మార్పిడి సదుపాయం ప్రారంభం



**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :** పివి నరసింహ రావు పశువైద్య విశ్వవిద్యాలయ పరిధిలోని రాజేంద్రనగర్ పశువైద్య కళాశాల,వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పశు రక్త మార్పిడి సదుపాయాన్ని బుధవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి సబ్యాసాచి ఘోష్ ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఇలాంటి సదుపాయాన్ని రాజేంద్ర నగర్ పశువైద్య కళాశాలలో ఆక్సిస్ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ వినూత్న సదుపాయం ద్వారా రక్త హీనత కలిగిన పశువులకు ,ప్రమాదంలో తీవ్ర రక్త స్రావం కలిగిన పశువులకు,వివిధ రోగాలతో బాధపడుతున్న పశువులకు రక్త మార్పిడి ద్వారా చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు .ఈ సదుపాయాన్ని రైతులు,పశు పెంపకం దార్లు,పెంపుడు కుక్కలు,పిల్లులు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి సబ్యాసాచి ఘోష్ కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ శరత్‌చంద్ర,డీన్ డా.రఘునందన్,స్టూడెంట్ వెల్ఫేర్ అధికారి చిన్ని ప్రీతం,విస్తరణ సంచాలకులు డా.మహేందర్,పరీక్షల అధికారి గోపాల్ రెడ్డి,కంప్ట్రోల్లర్ ప్రదీప్,కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉదయ కుమార్,రామచంద్రరెడ్డి,సతీష్,విద్యార్థులు పాల్గొన్నారు

## కంటి చూపును కాపాడుకోవాలి..

**-ఎంఈఓ శంకర్ రాథోడ్ ..**



**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :**
విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు స్వీయ జాగ్రత్తలతో కంటి సమస్యలు రాకుండా చూసుకోవొచ్చని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. హోలీ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో రాజేంద్ర నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సెల్ ఫోన్, కంప్యూటర్ల వినియోగం ఆధికమైనందున చాలా మంది కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటిని వీలైనంత తక్కువగా వినియోగించాలని సూచించారు. వీటి వ్యసనంతో విద్యా ర్థులు ఎంతో విలవైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని,హోలీ క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్య, వైద్య పరమైన సహాయ, సహకారం అందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. కంటి సమస్యలున్న విద్యార్థులకు త్వరలో అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మ్యాక్సీ విజన్ ఆస్పత్రి ఆప్తమోటిస్ట్ లియాజ్ అలీ, కౌన్సిలర్ లావణ్య పాల్గొన్నారు.

## వాహనదారులు తప్పకుండ హెల్మెట్లు ధరించాలి

**-నగర అదనపు ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్**



కార్యక్రమంలో పాల్గొన్న నగర అదనపు (ట్రాఫిక్ )పోలీస్ కమిషనర్ వి.విశ్వ ప్రసాద్

**చార్మినార్,నవంబరు 20 ప్రభాతవార్త :** హెల్మెట్లను ధరించటం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని,వాహనదారులు తప్పకుండ హెల్మెట్లను ధరించి వాహనాలను నడపాలని నగర అదనపు (ట్రాఫిక్) పోలీస్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ అన్నారు.హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలో బుధవారం సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు,ఐసిఐసిఐ లొంబార్డ్,ట్రాక్స్ ఎస్ సొసైటీతో కలిసి నిర్వహించిన రైడ్ టూ సేఫ్టీ క్యాంపియన్,రోడ్డు భద్రతాపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతాపై ఈ నెల ఒకటివ తేదీ నుంచి ప్రజలలో చైతన్యం కోసం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.వాహనదారులతో పాటు వెనుక కూర్చున వారు కూడ హెల్మెట్లు ధరించాలని, హెల్మెట్లను ధరించటం వల్ల ప్రమాదాలు బారిన పడకుండ రక్షించుకోవచ్చునని ఆయన తెలియజేశారు.బండ్లగూడ ప్రాంతంలో వాహనాలు నిలిపి హెల్మెట్లు ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్,రోడ్డు భద్రతతో పాటు హెల్మెట్ల వాడటం వల్ల కలిగే ఉపయోగాలు గురించి ప్రజలలో చైత్యనం తీసుకు రావటానికి ఈ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. లోయర్ ఇన్‌కమ్ కలిగిన హెల్మెట్లు కొనుగోలు చేయలేని వారికి ట్రాక్స్ ఎస్ సొసైటీ 250 హెల్మెట్లను అందించినందుకు ఆయన అభినంధించారు.ఈ కార్యక్రమంలో ట్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్టు హెడ్ ఆరాధనా జైన్,ప్రాజెక్టు అధికారి రాజేష్ నీమ్‌కర్,టాఫిక్ మూడు డిసిపి ఆర్.వెంకటేశ్వర్లు,సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసిపి వి.చంద్రకుమార్,చాంద్రాయణ గుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జె.శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేకు ప్రజలే ముందుకు రావటం అభినందనీయం : ఎంపి

**ముషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు తెలిపేందుకు ప్రజలే ముందుకు రావటం అభినందనీయమని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ కొనియాడారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ సర్వే వల్ల ఎవరికీ ఎలాంటి నష్టం జరగదని, వివరాలు తెలియచేయటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అందరినీ భాగ స్వాములు చేయటానికి దోహదపడుతుందని తెలిపారు. స్థానిక ప్రజలంతా ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సమాధానాలు చెప్పి సర్వేకు సహకరించాలని కోరారు. వ్యక్తిగత వివరాలు ఇవ్వటం ద్వారా ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు పొందే అవకాశం ఉంటుందని, ఇళ్లు ఉన్నవారు ఇతర సంక్షేమ పథకాలలో లబ్ది పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రమేష్ యాదవ్, పి.ధర్మేందర్, సంగపాక వెంకట్, పాల్గొన్నారు.

## 35వ బ్యాచ్ అటవీ బీటు అధికారుల ప్రవేశ శిక్షణా స్నాతకోత్సవం

**జీడిమెట్ల, నవంబర్ 20, ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ, దూలపల్లి, హైదరాబాదు యందు 35వ బ్యాచ్ అటవీ బీటు అధికారుల ప్రవేశ శిక్షణా కార్యక్రమ స్నాతకోత్సవం బుధవారం జరిగింది. మే 20, 2024న ప్రారంభమైన ఈ (6)నెలల కార్యక్రమం నేటితో ముగిసింది. శిక్షణ పొందిన బీటు అధికారుల సంఖ్య (63)కాగా, వీరిలో (15)మంది మహిళా అధికారులున్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆర్.ఎం. డో్బ్రియాల్, తెలంగాణ రాష్ట్ర అటవీ దళాల అధిపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీట్ అధికారుల కోర్స్ డైరెక్టర్ సి.హెచ్.గంగా రెడ్డి, బీటు అధికారుల శిక్షణా కార్యక్రమం రిపోర్టును సమర్పించారు. పాసింగ్ ఔట్ పరేడ్ ను తనిఖీ చేసిన అనంతరం జరిగిన స్నాతకోత్సవ సమావేశంలో శిక్షణార్థులకు ముఖ్య అతిథి, ధృవపత్రాలను, ఆయా విషయాలలో ప్రతిభను కనబరచిన అధికారులకు బంగారు పతకాలను, ప్రతిభా పత్రాలను ప్రదానం చేశారు. శిక్షణా కార్యక్రమం అంతిమ పరీక్షలలో బీటు అధికారులలో (24)మంది ఆనర్స్ శ్రేణిలో, (36)మంది ఉన్నతశ్రేణిలో, మిగతావారు దిగువశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. శిక్షణా కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా చెన్నూరు అటవీ డివిజన్‌కు చెందిన ఎం.స్రవంతి (3)బంగారు పతకాలను సాధించారు. రాజన్న సిరిసిల్ల అటవీ డివిజన్‌కు చెందిన బి. శ్రీకాంత్ (2)బంగారు పతకాలను, వై. రాముడు, జె. కృష్ణకాంత్, కె. రంజిత్ రెడ్డి, డి.శ్రీవిద్య, సి.హెచ్.స్నేహలత, ఎం. వినోద్ కుమార్, ఎం. నవీన్ కుమార్, ఎం. మనస్విని, బి.జోగేష్ ఒక్కొక్క బంగారు పతకాన్ని పొందారు. మారథాన్ పరుగు పందెంలో మహిళల విభాగంలో జీవిత, పురుషుల విభాగంలో బి.నరేష్ బంగారు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, డో్బ్రియాల్ శిక్షణ అధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, శిక్షణ అందించిన జ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించుకొని శిక్షణాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అటవీ సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అకాడమీ సంచాలకులు, డా.ఎస్.జె.ఆషా కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా విశ్రాంత అటవీ అధికారి కిషన్ పాల్గొన్నారు. అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్. రమేష్, సంయుక్త డైరెక్టర్ బి.ప్రవీణ, డిప్యూటీ డైరెక్టర్లు బి.వి.రావు, కె.శ్రీనివాస్, సి.హెచ్.కృష్ణ ప్రసాద్, వినయ్ కుమార్ సాహు, సమావేశంలో పాల్గొన్నారు. రేంజ్ అధికారులు, ఎం.వంశీ కృష్ణ, వై.సుభాష్ చంద్ర యాదవ్,
ఎం.రామ్ మోహన్, బాబా ఖాదర్ వలీ, ఫిజికల్ ట్రైనర్స్ అశోక్ రెడ్డి, కొండల్ రావు, రఫీ ఉల్లా, అనిల్, శిక్షణ అటవీ బీట్ అధికారులు, శిక్షణ అటవీ రేంజ్ అధి కారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### దళితుల జర్నలిస్ట్‌పై దాడి నీచమైన చర్య : నర్సింగ రావు

**నిజాంపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త**
దళితుల జర్నలిస్టుపై అగ్ర కులాలవారు దాడి చేయడం నీచమైన చర్య అని, దిశ దిన పత్రికలో ఓ నిర్మాణ సంస్థపై వాస్తవ కథనాలు ప్రచురించిన దుండిగల్ దిశ విలేకరిపై దాడిని మాల మహానాడు సెక్రటరీ జనరల్ బోళ్ల మల్ల నర్సింగ్ రావు తీవ్రంగా ఖండించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారినా దళితులపై దాడులు ఆగడం లేదన్నారు. దుండిగల్‌లో దిశ విలేకరి మద్దయ్యపై త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ ఎండి పసుపులేటి సుధాకర్ సిబ్బందితోపాటు, కొందరు అగ్రకులాల వారిని పురిగొల్పి చేసిన దాడిని దళిత హక్కుల పోరాట సమితి దృష్టికి తీసుకెళ్లి త్వరలో దళిత సంఘాల ఐక్యతతో రాస్తా రోకోలు, ధర్నాలు నిర్వహిస్తున్నట్లు హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా దళితులపై దాడులు ఆగడం లేదన్నారు. దళిత విలేకరిపై చేసిన దాడిని మాల మహానాడు రాష్ట్ర కమిటీ తరుపు కండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్ష పడేలా చూడాలని పోలీసలకు విజ్ఞప్తి చేసాడు. బౌరంపేట, డి.పోచంపల్లి పరిధిలో నిర్మిస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ ప్రభుత్వ స్థలాలు, కుంటలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే వాస్తవ కథనాలు రాయడం తప్పా అని ప్రశ్నించారు. మండలం మేజిస్ట్రేట్ అయిన తహసీల్దారు, అధికారుల సమక్షంలో దళితులపై దాడులు నిర్వహించడం క్షమించరాని నెరమన్నారు. అటువంటి వారిని న్యాయ స్థానం కఠినంగా శిక్షించాలన్నారు. త్వరలో బాధితుని తరుపున న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

### ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**-నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు**



బచ్‌పన్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

**బేగంపేట నవంబరు 20,ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు.బుధవారం బచ్‌పన్ పాఠశాల విద్యార్థులకు హీరో మోటార్స్ ఆఫీసు బేగంపేటలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు మరియూ నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ మైనర్లు (18)సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడపరాదన్నారు.అది చట్ట రీత్య నేరమని ,తెలియజేసారు.ఎవరైనా అలా వాహనాలు నడిపితే తల్లి దండ్రులతో పాటు వాహన యజమానులకు జైలు శిక్ష పడే అవకాశంఉంది.మరియూ 25వేల రూపాయల జరిమానాతో పాటు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారని ఆయన తెలియజేసారు.రోడ్ దాటే సమయంలో జీబ్రా లైన్ వద్ద మాత్రమే క్రాస్ చేయాలన్నారు.సిగ్నల్ జంపింగ్ అతి ప్రమాదకరం అన్నారు.ముఖ్యంగా రెడ్ సిగ్నల్ పడినపుడు తప్పని సరిగా వాహనం ఆపాలన్నారు.ఈ కార్యక్రమంలో 70మంది విద్యార్థులు,స్కూలు సిబ్బంది హీరో మోటార్స్ మేనేజర్ సాదిక్ ,సూపర్ వైజర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ సిటీ కళాశాలలో రక్త దాన శిబిరం



రక్తదానం శిబిరంలో పాల్గొన్న ఎన్.సి.సి.విద్యార్థులు

**చార్మినార్,నవంబరు 20 ప్రభాతవార్త :**
ఎన్.సి.సి.దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ సిటీ కళాశాల ఉస్మానియా ఆసుపత్రి కలిసి సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక రంగాలలో కూడ చురుకుగా పాల్గొనాలని కోరారు.రక్త దానం చేయటం వల్ల మరో ప్రాణాన్ని కాపాడిన వారమవుతామని ఆయనతెలిపారు.రక్త దాన శిబిరంలో 43 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి. అధికారి క్రిష్ణవేణి,కళాశాల అధ్యాపకులు ఎన్.సి.సి.కాడెట్లు పాల్గొన్నారు.

### ఆస్తికోసం బావమరిదిపై దాడి ..

**పంజగుట్ట, నవంబర్ 20 (ప్రభాతవార్త):** మామ ఆస్తిలో తనకూ సగం వాటా ఇవ్వాలని బావమరిదిపైనే దాడి చేసిన కానిస్టేబుల్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన అబ్దుల్ వాహిద్ తన సోదరిని లంగర్‌హౌస్‌కు చెందిన కానిస్టేబుల్ షాహిర్‌ఖాన్‌కు వచ్చి గత కొంతకాలం క్రితం వివాహం జరిపించారు. అయితే షాహిర్‌ఖాన్ తనకు ఆస్తిలో వాటా కావాలని తరచుగా వాహిద్ కుటుంబ సభ్యులను వేధింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలోనే బావమరిది వాహిద్ పై దాడికి పాల్పడ్డాడు. ఆస్తిలో సగం వాటా ఇవ్వక పోతే తన బావ తనను, తన కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తున్నాడని వాహిద్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి చర్యలు

**-కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్**




కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ తదితరులు

**చిక్కడపల్లి, నవంబరు 20 ప్రభాతవార్త:**
బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్మిక శాఖ అదనపుకమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆశ్రయ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి డాక్టర్ ఇ.గంగాధర్ హాజరై ప్రసంగించారు. 18 సంవత్సరాలలోపు చిన్నారులంతా బడిబాట పట్టేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని, వీరంతా బడిబాట పడితే వారి భవిష్యత్తు బంగారుబాట పడుతుందన్నారు. చిన్నారులను షాపులలో, ఇతర సంస్థలలో చేర్చుకుని పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దుఖాణాలలో చిన్నారులతో పనులు చేయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవిఎఫ్ ఫౌండేషన్ అధినేత వెంకటరెడ్డి, డాక్టర్ శాలిని, ఆశ్రయ్ ఫౌండేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, అంకిత ఫౌండేషన్ స్టీఫెన్ డానియెల్, ఆర్ఎఫ్ఐ సీనియర్ మేనేజర్ శ్రీలత,బాల తేజస్సు, ఆశ్రిత, అనురాగ్ ఫౌండేషన్, అంకిత ఫౌండేషన్, అమన్ వేదిక, లాలపేట ఆశ్రయ్ భాయ్ హోం, వరల్డ్ విజన్ ఇండియా, నైటింగేల్, బ్లూ ఫౌండేషన్, ఎస్ఆర్డి, ఆర్ఎస్ఐ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### కులాల జనాభాను బట్టి రిజర్వేషన్ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బాలరాజుగౌడ్, ఐలి వెంకన్న, విజయ్‌కుమార్‌గౌడ్, గణేష్‌చారి తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:**
కులాల వారీగా జనాభాను బట్టి రిజర్వేషన్ అమలు చేయాలి అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు ను తన కార్యాలయంలో కలిసి బీసీలకు, గౌడ్స్ కు న్యాయంగా రావాల్సిన హక్కులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే దాదాపుగా పూర్తి కావచ్చిందని మెత్తం జనాభాలో సగానికిపైగా బీసీలు ఉంటే అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని వివిధ కులాల వారిగా వారి వారి జనాభా ను బట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం బీసిల హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఉన్న రిజర్వేషన్లను కుదించి స్థానిక సంస్థలలో, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో అన్యాయం చేసిందన్నారు. చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు వచ్చేంతవరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ చైర్మన్ యెలికట్టే విజయకుమార్ గౌడ్, బీసి కుల సంఘాల చైర్మన్ కుందారం గణేష చారి తదితరులు పాల్గొన్నారు.

### చుక్కా రామయ్యకు ఘనసత్కారం



చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

**ముషీరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ చుక్కా రామయ్య జన్మదినం సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలసి టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తదితరులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియచేశారు.

### విఎన్ఆర్ విజెఐఈటీలో ఘనంగా స్పోర్ట్స్ ఫెస్ట్..

**నిజాంపేట్, నవంబర్ 20, ప్రభాతవార్త :** విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 16వ అఖిల భారత ఓపెన్ ఇంటర్ ఇంజనీరింగ్ కాలేజీయేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ ఫెస్ట్ లో విఎన్ఆర్ విజెఐఈటీతో సహా ఇతర రాష్ట్రాలకు చెందిన 79 కళాశాలల క్రీడాకారులు 1700 మంది బ్యాడ్మింటన్, బాస్కెట్బాల్, చెస్, ఫుట్బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, త్రో బాల్, వాలీబాల్, క్రికెట్ వంటి పోటీల్లో క్రీడలు జరగనున్నాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి డి నాయుడు మాట్లాడుతూ జయపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## అయ్యప్ప నామ స్మరణంతో మారుమ్రోగిన మణికొండ



మణికొండ మున్సిపల్ లాలమ్మ గార్డెన్ వద్ద జరిగిన అయ్యప్పస్వామి మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, నవంబర్ 20 ప్రభాతవార్త :** కలియుగ ప్రత్యక్ష దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామ స్మరణంతో మణికొండ మారుమ్రోగింది. గండిపేట్ మండల పరిధిలోని మణికొండ మున్సిపల్ లాలమ్మ గార్డెన్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప భక్తిగీతాలే వినిపించాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా అయ్యప్పస్వామి మహా పడి పూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప స్వాములు లయబద్ధంగా హరిహర తనయుడిని స్తుతిస్తూ ఆలపించిన భక్తిగీతాలు ఆహుతులను, స్థానిక ప్రజలను భక్తిసాగరంలో ముంచెత్తాయి. ఈ పూజకు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొని మహా పడిపూజ హారతిని కళ్లకు అద్దుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైతం ఆధ్యాత్మికతకు యువత పెద్దపీట వేస్తుండడం, మన సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. హిందూ సంస్కృతిలోని ప్రతీ పర్వదినం వెనుక ఓ ఆరోగ్య రహస్యం దాగుంటుందని, అది మానవాళికి, సర్వ ప్రాణులకు మేలు చేసేదిగా ఉంటుందని వివరించారు. ఏటేటా అయ్యప్ప మాలధారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తజనం పాల్గొని కరుణా హృదయుడు శబరిగిరీశుడి కృపకు పాత్రులయ్యారు.

## సంప్రదాయ కళల ఉత్సవంలో శోభాయమానంగా యక్షగాన బుర్రకథలు



సంప్రదాయ కళల ఉత్సవంలో యక్షగానం-బుర్రకథల దృశ్యం

**రవీంద్రభారతి, నవంబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వైభవోపేతంగా జరుగుతున్న 4రోజుల సంప్రదాయ కళల ఉత్సవం రెండవరోజు బుధవారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మేడ్చల్ జిల్లా బృందంచే గడ్డం పెద్దులుచే శశిరేఖ కళ్యాణం చిందు యక్షగానం; గుళ్ళపహాడు, సూర్యాపేట జిల్లా దొంతగాని వెంకటేశ్వర్లు బృందంచే సీతాకళ్యాణం బుర్రకథ; కూచిపూడి కృష్ణా జిల్లా డా. వేదాంతం రామలింగశాస్త్రి బృందంచే భక్తప్రహ్లాద కూచిపూడి యక్షగాన ప్రదర్శనలు ఎంతో శోభభాయమానంగా ప్రదర్శింపబడి విచ్చేసిన ప్రేక్షకులను అబ్బురపరిచి ఎంతగానో ఆకట్టుకొని ఆహ్లాదపరిచాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. పి.రఘు, ప్రముఖ నాట్యగురువు డా. మద్దాళి ఉషాగాయత్రి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు ఈనాటి సంప్ర దాయ కళల ఉత్సవంలో ప్రదర్శనలిచ్చిన చిందు యక్షగాన, బుర్రకథ, కూచిపూడి యక్షగాన కళాకారులను ఘనంగా సత్కరించి, కిన్నెర సంస్థ రఘురామ్‌ను ఎంతగానో అభినందించారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : జగదీశ్వర్‌గౌడ్




మండల స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వి.జగదీశ్వర్‌గౌడ్,స్థానిక

**శేరిలింగంపల్లి, నవంబర్ 20 ప్రభాతవార్త**
విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచినప్పుడే జీవితంలో మరింత రాణించగలుగుతారని శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శేరిలింగంపల్లి చందానగర్ డివిజన్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి మండల రికగ్నైజ్‌డ్ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ టీమ్ స్పిరిట్ 2024-25 మండల స్థాయి స్పోర్ట్‌మీట్ మూడవరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థి, విద్యార్థినులకు జగదీశ్వర్‌గౌడ్ మెడల్స్,షీల్డ్‌లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, శారీరకంగా బాగుంటేనే చిన్నారులు మానసికంగా దృఢంగా ఉంటారని, అందుకు స్పోర్ట్స్ మీట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని ఆయన హితవుపలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మిరియాల రాఘవరావు, సునీత ప్రభాకర్‌రెడ్డి, ఉరిటి వెంకట్రావు, మండల స్థాయి రికగ్నైజ్‌డ్ ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెంట్స్ అధ్యక్షులు మారోజు ఆచార్య,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శంకర్,కోశాధికారి అబ్దుల్ రహ్మాన్, సలహాదారులు భీష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్‌కుమార్, ఎల్ఎన్‌బి. వెంకటేశ్వరరావు,త్రిమూర్తులు,నిజాం ఆలీఖాన్,రాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఇక్బాల్,వెంకటేష్,చంద్రశేఖర్, స్కూల్ టీచర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్యుత్ సంస్థలు దివాలా

**-టిజిఎస్‌పిడిసిఎల్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ**

**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:**
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యుత్‌సంస్థలు దివాలా తీసి వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయి సతమతమవుతున్నాయి టీజీఎస్పీడీసీఎల్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ ఆరోపించారు. ఉద్యోగులకు 1 వ తేదిన జీతాలివ్వని పరిస్థితికి తీసుకువచ్చిన గణత గతపాలకులదేనన్నారు. ప్రజలిచ్చిన ఓటమి షాక్ తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వం, విద్యుత్ సంస్థలపై అనుచిత వాఖ్యలు చేస్తున్నారని అన్నారు. ఈమేరకు బుధవారం నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అక్రమ విద్యుత్ కొనుగోళ్లు, అక్రమ అనుమతులపై జస్టిస్ మదన్ లోకూర్‌కమిషన్ నివేదిక ఆధారంగా బాధ్యులలైన గత ప్రభుత్వం పెద్దలు, ఉన్నతాధికారులు, అప్పటి సంస్థ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్లో ఏ ప్రభుత్వాధినేత తప్పుడు విధానాలకు పాల్పడకుండా ఓప్రత్యేక విధానం అందుబాటులోకి తేవాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కాలనీల్లో పబ్లిక్ ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటు చేయడం కష్టంగా మారిందన్నారు. పబ్లిక్ స్థలాల కొరత, స్థానికుల అభ్యంతరాలతో డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. గత 20 ఏళ్లలో విద్యుత్ వినియోగంలో భారీ మార్పులు వచ్చాయని, అనేక కొత్త రకాలైన విద్యుత్ పరికరాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో రావడంతో విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో పెరిగిందన్నారు. ప్రస్తుతం నోటీసులిచ్చిన విద్యుత్ కనెక్షన్లకు తగిన అంచనాలు వేసి విద్యుత్ సంస్థలే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కాకుండా నేరుగా విద్యుత్ సంస్థలు ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటుచేస్తే ఖర్చు తగ్గుతుందన్నారు. కొత్త వినియోగదారుల నుంచి భవిష్యత్తులో 20 కిలో వాట్ల లోడ్ దాటితే, సొంతంగా డీటీఆర్ లు ఏర్పాటు చేసుకుంటామనే హామీ పత్రం తీసుకోవాల్సి న అవసరముందన్నారు. అపార్ట్మెంట్లు, కమర్షియల్ భవనాలకు ప్రత్యేక ట్రాన్స్ఫర్మర్లు ఏర్పాటుతో ఓల్టేజి సమస్యలు లేకుండా పోతాయన్నారు. నిబంధనలు ముందు నుంచి ఉన్నా గతపాలకుల నిర్లక్ష్యంతో అమలుచేయకపోవడంతో ఇప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రజల క్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మేధావులు, ఇంజ నీర్లు సమర్థించాల్సి న అవసరముందని ఆళ్ల రామకృష్ణ పేర్కొన్నారు.

## టిడిపికి పూర్వ వైభవం రాబోతుంది

**-చేవెళ్ల పార్లమెంట్ టిడిపి సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సమావేశం**
**-హాజరైన రాష్ట్ర టిడిపి ముఖ్యనేతలు**



**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో టిడిపికి పూర్వ వైభవం రాబోతుందని టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిట్ బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు ,రాష్ట్ర వ్యవహారాల సమన్వయకర్త కంభంపాటి రామోహన్ రావు,టిటిడి దేవస్థానం మెంబరు నన్నూరి నర్సిరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఉప్పర్‌పల్లి భూపాల్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కె.వెంకటేష్ గౌడ్,మాజీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డిల అధ్యక్షతన చేవెళ్ల పార్లమెంట్ టిడిపి సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జాతీయ ప్రధాన కార్యదర్శి పొలిటీ బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు,రాష్ట్ర వ్యవహారాల సమన్వయకర్త కంభంపాటి రామోహన్ రావులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు.....రాష్ట్రంలో 3లక్షల సభ్యత్వ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని త్వరలోనే రాష్ట్రంలో టిడిపికి పూర్వవైభవం రాబోతుందని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి తెలంగాణను దోచుకుంది తప్ప చేసిందేమి లేదని వాపోయారు.ధరణి పేరుతో మాజీ సిఎం కెసిఆర్,కెటిఆర్‌లు పేదల భూములు లాక్కున్నారని పేదల పక్షానా టిడిపి పోరాడి వారికి భూములను అందేలా చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తుందని పేదల జోలికి వస్తే సహించేది లేదని వారికి టిడిపి అండగా ఉంటుందన్నారు.హైదరాబాద్‌ను చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేయడంతోనే నేడు అనేక కంపెనీలు వస్తున్నాయని టిడిపి హయాంలో ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు అందించి అండగా నిలిచిందని మళ్లీ అనాటి రోజులు రావాలంటే రాబోయే రోజుల్లో టిడిపి నాయకులు ,కార్యకర్తలు కష్టపడి పని చేసి పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గూడెపు రాఘవులు,నెల్లూరి దుర్గా ప్రసాద్,షకిలా రెడ్డి,సుభాషిణి, విజయ కిష్ణ,సిరాజుద్దీన్,తమోదన రావు ,షాబాద్ మాణిక్యం మల్లిఖార్జున్ యాదవ్,క్రిష్ణా గౌడ్,జిపిఎల్ డైరెక్టర్ రావు,జిఎం నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

**అత్తాపూర్ నవంబరు20,ప్రభాతవార్త :**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థుల అంతర్ కళాశాలల క్రీడలు మరియు ఆటల పోటీలు రెండవ రోజు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలలో 11 కళాశాలకు చెందిన దాదాపు 450 మంది క్రీడాకారులు పాల్గొని వారి ప్రతిభను కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా రెండవ రోజు వివిధ క్రీడలను నిర్వహించారు. ఫుట్ బాల్ మరియు వాలీబాల్ క్రీడలో అశ్వరావుపేట మరియు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, బాల్ బ్యాడ్మింటన్ లో అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల మరియు సంగారెడ్డి అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సెమీఫైనల్ కి చేరుకున్నారు. బాలికల విభాగంలో వాలీబాల్ లో రాజేంద్రనగర్, టెన్నికాయిట్ లో జగిత్యాల మరియు అశ్వరావుపేట, టేబుల్ టెన్నిస్ లో అశ్వరావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సెమీఫైనల్ కి చేరుకున్నారు. ఈ క్రీడల్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నాయి.



ఎమ్మెల్యేతో యాదవ సంఘం సభ్యులు

## ఎమ్మెల్యేను కలిసిన యాదవ సంఘం కమిటీ సభ్యులు

**యాచారం,నవంబర్ 20, ప్రభాతవార్త** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న మల్లికార్జున స్వామి దేవాలయానికి ఆర్థిక సహాయం కోరుతూ ఇబ్రహీం పట్నం శాసన సభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి కమిటీ సభ్యులు కలిసి విన్నపం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటా యని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుం దని గ్రామాలలో ఆలయాల నిర్మించాల్సిందేనని కమిటీ సభ్యులకు భరోసా కల్పిస్తూ సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఎరుకల బాలరాజు, ముంత జంగయ్య, సంపత్ కుమార్, ఆడాల గణేష్, ఆలయ కమిటీ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 1 నీ విజయవంతం చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న మాల సంఘం నాయకులు బంధుమిత్రులు

**యాచారం, నంబర్ 20, ప్రభాతవార్త** అబద్దాన్ని నిజం చేయాలనుకునే వర్గీకరణ వ్యతిరేకిస్తూ డిసెంబర్ 1న హైదరాబా దులో నిర్వహించే మాలల ఐక్యవేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నంది వనపర్తి జై భీమ్ యూత్ అధ్యక్షులు మరాఠీ వివేక పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో మాలల గ్రామ శాఖ ఐక్యవేదిక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ.. సంఘటితమై మాలల హక్కులను కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. కమిటీ సభ్యులు దార శివ,దార సాయి కుమార్, శ్రీకాంత్, కుమార్, విజయ్ కుమార్ , మహేందర్ లను అందరి ఆమోదంతో ఎన్నుకోవడం జరిగిందనీ తెలిపారు. మాల కుల బాంధవులు దార ఆనంద్ కుమార్, బాలరాజు, శ్రీరాములు, చంద్రయ్య, రవి, దర్శన్, నర్సింహా, మహేందర్, సాయి కుమార్, శ్రీను, రాహుల్ ,శివ, శివ, రంగయ్య , కుమార్, సురేష్ , రాములు,కార్తీక్, జంగయ్య, మహేందర్, రాజేందర్, సిధార్థ, రవీంద్ర, బుగ్గయ్య, పెద్దయ్య మరియు జై భీం సభ్యులు పంబాల శివాజీ, గుండె మధు , తెలగమల్ల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కార్యదర్శిని పరామర్శించిన నాయకులు



బాధితున్ని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు నరసింహ బ్రహ్మయ్య చందు నాయక్ జంగయ్య

**యాచారం, నవంబర్ 20, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై గ్లోబల్ హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న పార్టీ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి రాములు నీ సిపిఎం పార్టీ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సంధ్బంగా సీపీఎం నాయకులు మండల ప్రధాన కార్యదర్శి అలంపల్లి నరసింహ మాట్లాడుతూ.. పార్టీ నాయకులు కార్యకర్తలు ఆపదలో ఉన్నవారిని పార్టీ తరపున ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. సిపిఎం పార్టీ ప్రజా సమస్యల పై పోరాడుతూనే పార్టీ నాయకుల కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తూ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పెండ్యాల బ్రహ్మయ్య,ఆలంపల్లి జంగయ్య, చందు నాయక్, ఎంజే వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**బొంరాస్‌పేట్,నవంబర్ 20,ప్రభాతవార్త :** ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పుమల్లలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓ గా అక్షయ, ఎంఈఓ గా నితీన్, జిహెచ్ఎంగా ధ నాష్, హెచ్ఎం గా శ్రీనివాస్ వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన పలువులు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వసంత, హెచ్ఎం వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు సర్ధార్, కిషన్, ప్రశాంత్ కుమార్, జ్యోతి, కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధ్యాయ సంఘాల జెఏసి ధర్నా వాయిదా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల స్పౌజ్ పాయింట్ల అవకతవకలపై ఉపాధ్యాయ సంఘాల జెఏసి ఆధ్వర్యంలో గురువారం 21న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను వాయిదా వేసినట్లు ఉపాధ్యాయ జెఏసి సంఘాల నాయకులు పేర్కొన్నారు. అయితే ఉపాధ్యాయ బదిలీల స్పౌజ్‌కు సంబంధించి కోర్టు ఉత్తర్వులు గురువారం వెలువడే అవకాశం ఉన్నందున జిల్లా విద్యా అధికారి విజయకుమారి సూచించిన మేరకు గౌరవించి ఈ గురువారం చేయాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని డిఇఓ కార్యాలయంలో జెఏసి ఉపాధ్యాయ ప్రతినిధులతో డిఇఓ సమావేశం ఉన్నట్లు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి.వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, ఊరెళ్ల విఠల్, రాజ్‌కుమార్, బ్రహ్మచారిలు తెలిపారు.

## బైక్ ఢీకొని లారీడ్రైవర్ మృతి

**ఘట్‌కేసర్, నవంబర్ 20, ప్రభాతవార్త:** బైక్ ఢీకొని ఓలారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉప్పల్‌కు చెందిన మోతె యాదయ్య (55) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం అవుషాపూర్ మీదుగా ఘట్‌కేసర్ వైపుకు వస్తుండగా జాతీయరహదారిపై లారీ టైర్ పంచర్ కావడంతో కేసీఆర్ పార్క్ వద్ద లారీ పక్కకు ఆపి చూస్తుండగా బైక్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. బైకిస్ట్ నిర్లక్ష్యంగా బైక్ నడిపి లారీ డ్రైవర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు యాదయ్య మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శిపై డిపిఓ ఆగ్రహం

**ధారూరు, నవంబర్ 20, ప్రభాతవార్త ః** మండల పరిధిలోని నాగసమందర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అనంతరాజురెడ్డిపై వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారిని డాక్టర్ జయసుధ సీరియస్ అయ్యారు. బుధవారం మండల పంచాయతీ అధికారి షఫీ ఉల్లాఖాన్‌తో కలిసి అకస్మాత్తుగా గ్రామానికి తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం ,కంపోస్ట్ షెడ్, నర్సరీ, వైకుంఠ ధమం, రికార్డుల ు పరిశీలించారు. ఈ సందర్భంగా కంపోస్ట్ షెడ్, నర్సరీ తదితర నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు,పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం ఎంపీఓ కు పలు సూచనలు చేశారు. ఆమెతోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైస్ మిల్ ప్రారంభం

**ధారూరు, నవంబర్ 20, ప్రభాతవార్త ః** నేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైస్ మిల్, గోదాం ు ప్రాంభిస్తు న్నట్లు పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ హాజరైతారని తెలిపారు. కార్యక్రమానికి డైరెక్టర్లు, రైతులు, ప్రజా ప్రతినిధులు నాయకులు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాల సీజ్

**నవాబుపేట నవంబర్ 20 ప్రభాతవార్త:** మండలంలో అక్రమంగా మట్టిని తరలించిన వాహనాలను సోమవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. రాత్రి పూట అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయం తెలుసుకుని వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మొత్తం 5 వాహనాలను అదుపులోకి తీసుకున్నామని అందులో 4 టిప్పర్లు, ఒక జేసీబీ ఉన్నాయని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## అయ్యప్ప భక్తులకు అన్నదానం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, నవంబరు 20 ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో అయ్యప్ప భక్తులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో మొదటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్య ప్ప భక్తులకు అన్నదానం చేయడం మహాపుణ్యం అని అన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్ గౌడ్, గూనెల్లి రమేష్, విల్సన్ టైలర్ బాల్‌రెడ్డి, అశోక్ గౌడ్, రవీందర్ గౌడ్, శికీరా రమేష్, పోలే రాజేశ్వర్, అగ్గ నూరు బస్వం, కట్ట వెంకటేష్ గౌడ్, శ్రీశైలం గౌడ్, కొమ్ము కృష్ణ, కృష్ణారెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## గుట్టపై నుండి దూకిన వ్యక్తికి తీవ్ర గాయాలు

**యాచారం,నవంబర్ 20, ప్రభాతవార్త....** అనుమానాధస్పద స్థితిలో ఓ వ్యక్తి గుట్టపై నుండి దూకి తీవ్ర గాయాల పాలైన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ మోలాలి హౌసింగ్ బోర్డ్ కు చెందిన ఏలూరి రామాంజనేయులు (32) ఉత్తిరీత్యా కూలి పని చేసుకునేవాడు. మంగళవారం హైదరాబాదు నుండి స్కూటీపై కందుకూరు మండలం మీర్ఖాన్ పేట వరకు చేరుకొని అక్కడ స్కూటీలో పెట్రోల్ అయిపోవడంతో కాలినడకన యాచారం మండల పరిధిలోని అయవారిగూడ అనుబంధ గ్రామమైన ఏనేకింది తండా గుట్ట పైకి వెళ్లి జై ఆంజనేయని అంటూ గుట్టపై నుంచి కిందకు దూకేక్రమంలో మధ్యలో చిక్కు పోయినాడు అని తెలిపారు. స్థానికులు కాలకృత్యాలకు వెళ్లే సమయంలో గుట్టపై నుంచి పరుపుల చప్పుడు విని ఎవరో ఉన్నాడని తెలుసుకున్నారు, కాపాడలేక పోయారు. పోలీసులకు సమాచారం చేరవేయడంతో ఎస్సై మధు సంఘ టన స్థలానికి చేరుకొని కానిస్టేబుల్ శంకర్, శేఖర్, హెచ్ జిలు మహేందర్, తిరుపతి, స్థానికులు సభావత్ వినోద్, విజయ్, పాండు క్షతగాత్రుని రక్షించి గుట్టపై నుండి కిందికి తీసుకువచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు పూర్తి వివరాలు సేకరించి క్షతగాత్రున్ని హైదరాబాదులోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. బాధి తుని కాపాడిన పోలీస్ సిబ్బందికి, స్థానికులను ప్రశంసించారు.

## గట్టు ఇప్పలపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**తలకొండపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గట్టుపల్ పల్లి లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం ఏమిటని? బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం నాడు గట్టు ఇప్పలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో ఉన్న పెద్ద గ్రామాలకు గతంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం గట్టిపలపల్లి పెద్ద గ్రామపంచాయతీ అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరమని ఆయన అన్నారు. తమ గ్రామాన్ని మండలంలో ఏర్పాటు చేయాలని గత కొంతకాలంగా స్వచ్ఛందంగా దీక్షలు చేపట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీ వారు నిమ్మకు నీరు ఎత్తడం విడ్డూరమన్నారు. మండల ఏర్పాటుపై తమ వైఖరి ఏమిటో తెలియజేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఏదుల రాజు, సింగల్ విండో డైరెక్టర్ కోలా శిరీష కృష్ణయ్య శరత్చంద్ర చిట్యాల రవీందర్ నరసింహ పురుషోత్తం విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ధార్‌నగర్ గ్రామపంచాయతీని సందర్శించిన ఒరిస్సా బృందం



నర్సరీని పరిశీలిస్తున్న ఒరిస్సా బృందం

**షాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త :**

షాబాద్ మండల సర్దార్‌నగర్ గ్రామపంచాయతీని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం బుధవారం సందర్శించినట్లు ఎంపీడీవో అపర్ణ అన్నారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీలో జరుగుతున్న ఆన్‌లైన్ సేవలు రికార్డుల నిర్వాహణపై అధికారులు వారికి వివరించారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి గ్రామపంచాయతీ నిధుల సమీకరణ, రాష్ట్ర నిధుల నిర్వాహణ, ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నర్సరీ, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం, వైకుంఠదామం, ప్లాంటేషన్ తదితర అంశాలను చూశారు. ఈకార్యక్రమంలో జిల్లా శిక్షణ మేనేజర్ అనిల్‌కుమార్, రుద్రయ్య, ఈవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శి కవిత, గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ నాగారం నర్సింలు మృతి

**తాండూరు, నవంబరు 20, ప్రభాతవార్త :** బీజేపి సీనియర్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగారం నర్సింలు ఇకలేరు. బుధవారం ఆయన గుండే పోటుతో కన్నుమూశారు. ఆయన మృతి తాండూరు రాజకీయాలలో దిగ్భ్రాంతికి గురిచేసింది. నాగారం నర్సింలు చాలాకాలంగా బిజెపిలో కొనసాగారు. పార్టీ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆయన అకాల మృతి పార్టీకి తీరని లోటని పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ.. సంతాపం ప్రకటిం చారు.

## గోపుర నిర్మాణానికి రూ.13 లక్షల విరాళం

**షాద్‌నగర్, నవంబరు 20 (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో రాజగోపుల నిర్మాణ పనుల నిమిత్తం పట్టణంలోని శ్రీనివాస మెడికల్ హాల్ నిర్వాహకులూకుల అరుణ వెంకటేష్ దంపతులు రూ.13 లక్షలను విరాళంగా అందించారు. ఈ విరాళా న్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్‌కు అందజేశారు. ఆలయ రాజగోపురం ద్వారాల నిర్మాణా నికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



విరాళాన్ని అందజేస్తున్న దాతలు అరుణ, ఆకుల వెంకటేష్ దంపతులు

## ప్రజా సంఘాలను నిర్బంధించడం తగదు

### ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్



పోలీసుల అదుపులో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

**షాద్‌నగర్, నవంబరు 20 (ప్రభాతవార్త) :** ప్రజా సంఘాలను నిర్బంధించడం ప్రజాపాలన ఎలా అవుతుందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంబల్ నాయక్ ప్రశ్నించారు. బుధవారం ఉదయం లగచర్ల బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు రాంబల్ నాయక్, చందర్ నాయక్‌లను పట్టణంలోని రసోయ్ హోటల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రాంబల్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ పోలీసులను అడ్డం పెట్టుకొని ఎన్ని రోజులు అక్రమ నిర్బంధాలు చేస్తారని మండిపడ్డారు. లగచర్ల రోటీబండ తండా భూములను లాక్కోవద్దని న్యాయపోరాటం చేస్తున్న తమను అరెస్టు చేయడం విడ్డూరమన్నారు. ఇప్పటికే న్యాయం కోసం జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, కేంద్ర వర్గాలను కలుసుకున్నామన్నారు. లగచర్ల భూములను ప్రభుత్వం తీసుకోకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పోరాటానికి శ్రీకారం చుడతామన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో లక్ష్మణ్ నాయక్, చందు నాయక్, లిబియా నాయక్, ఏకనాథ్ నాయక్, రాజు నాయక్, యోధ్య శ్రీనివాస్, జగన్ నాయక్, మోహన్ బాబు, రాజేందర్, అంబదాస్, భోజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్, నవంబరు 20 (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని జానంపేట శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కనుల పండువలా జరిగింది. బుధవారం స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, భక్తులు అంజయ్య యాదవ్‌ను ఆలయంలోకి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో గొప్పగా ఆలయాన్ని నిర్మించి ప్రజల్లో ఆధ్యాత్మిక ప్రభంజనాన్ని సృష్టిస్తున్నారని, ఇది జగతికి ఎంతో మేలని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ స్వామి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్.నటరాజన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణ రెడ్డి, చీపిరి రవి నాయక్, గంధం ఆనంద్, పిల్లి శేఖర్, చెర్క శివ, తదితరులు పాల్గొన్నారు.

## లోకమంథన్ కార్యక్రమంలో షాద్‌నగర్ కళాకారులు

**షాద్‌నగర్, నవంబరు 20 (ప్రభాతవార్త) :** నేటి నుండి ఈనెల 24వ తేదీ వరకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించబోయే లోక్‌మంథన్ కార్యక్రమంలో షాద్‌నగర్‌కు చెందిన పలువురు కళాకారులు పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీన నిర్వహించబోయే భువనవిజయ నాటకాన్ని పట్టణానికి చెందిన సాహితీ కళాభారతి సభ్యులు ప్రదర్శించనున్నారు. అనంతరం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన మృదుల ముసునూరి నాటకంలో యువరాణి పాత్రను పోషిస్తున్నట్లు వారు తెలిపారు.

## వివాహ వేడుకకు హాజరుకండి

### ఎనుముల తిరుపతిరెడ్డిని ఆహ్వానించిన ఎమ్మెల్యే శంకర్



ఎనుముల తిరువతిరెడ్డిని ఆహ్వానిస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, నవంబరు 20 (ప్రభాతవార్త) :** తన కోడలు వివాహానికి హాజరుకావాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డిని కొడంగల్‌లోని ఆయన స్వగృహంలో కలుసుకొని ఆహ్వానించారు. వచ్చే నెల 24న షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో జరిగే వివాహానికి రావాల్సిందిగా ఆయనను కోరారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, సుదర్శన్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, ముబారక్ ఖాన్, సయ్యద్ ఖదీర్, సీతారం, తదితరులు ఉన్నారు.

## గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షునికి శుభాకాంక్షలు వెల్లువ

**బొంరాస్‌పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త :** వికారాబాద్ పట్టణంలో జరిగిన టీఎస్ జిహెచ్ఎంఏ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా హరిలాల్ ను ఎ న్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం టీఎస్ జిహెచ్ఎంఏ రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్రప్రకాష్ ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి, కోశాధికారి తుకారాం ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.సర్వసభ్య సమావేశానంతరం వికారాబాద్ టీఎస్ జిహెచ్ఎంఏ ప్రస్తుత కార్య వర్గాన్ని రద్దుచేసి నాతన కార్య వర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో వికారాబాద్ జిల్లా టీఎస్ జిహెచ్ఎంఏ అధ్యక్షులుగా శ్రీ హరిలాల్, ప్రధాన కార్యదర్శిగా రామ్ రెడ్డి,కోశాధికారిగా రాములు, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం అంజయ్య, గౌరీ శంకర్,హీర్యా నాయక్ ఎన్నికయ్యారు నాతనంగా ఎ న్నుకున్న కార్య వర్గం ప్రమాణ స్వీకారం అనంతరం వారు మాట్లాడుతూ సంఘప టిష్ట తకు జిల్లాలో గల ప్రధానోపాధ్యాయులు అందరి సమస్యలు తీర్చుటలో తమ వంతు సహకారం అందించి అందరికి సహాయకారిగా ఉంటామని తెలి పారు. నాతనంగా ఎన్నికైన కార్యవర్గం పట్ల జిల్లా, మండలంలోని గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అందరూ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



## గట్టు ఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి

**తలకొండపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త** గట్టు ఇప్పలపల్లిలో సహకార సంఘం ఏర్పాటు చేయాలి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి మండల సాధన కోసం అధికార పార్టీ వెంటనే స్పందించాలి బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి,మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి చొరవ చూపాలని, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి ,మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య అన్నారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏదుల రాజు,సింగల్ విండో డైరెక్టర్ కోల శిరీషకృష్ణయ్య,శరత్ చంద్ర,ఇట్యాల రవీందర్, నర్సింహా,పురు షోత్తం,విజేందర్ పాల్గొన్నారు.

## మహిళా శక్తి వారోత్సవాలు విజయంవంతం చేయాలి



**తలకొండపల్లి, నవంబర్ 20, ప్రభాతవార్త** ఈ రోజూ మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా నవంబర్ 19 నుండి డిసెంబర్ 9 వరకు ప్రతి రోజు చెయ్యలవలిసిన పనులు సంఘంలో లేని మహిళ లను సంఘంలో చేర్పించడం ఈ రోజులో కొత్తగాలో చేరిపించడం జరిగింది. త్రినాయియన్ మహిళా సంఘం 10 మంది అలాగే అంబేద్కర్ జ్యోతి రావుపులే సంఘంలో 10 మంది చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీసీలు విఏవోలు పాల్గొన్నారు. సీసీ దీప ఏపిఎం శ్రీదేవి పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెల్పడం జరిగింది.వ్యక్తి గత పాస్ బుక్‌లు అందరికీ ఇవ్వడం జరిగినది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లేష్ మృతి

**కేశంపేట నవంబర్ 20 ప్రభాతవార్త** కేశంపేట మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామానికి చెందిన మల్లేష్ గత వారం రోజుల క్రితం లేమామిడి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలైన విషయం పాఠకులకు తెలిసిందే.గాయాల పాలైన కేశంపేట మల్లేష్ ఉస్మానియా ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 11:30 నిమిషాలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మల్లేష్ చికిత్స కోసం దాతలు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు మల్లేష్ కోలుకొని తన కుటుంబ సభ్యులతో కలిసి శేష జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.కానీ విధి ఆడిన వింత నాటకం మల్లేష్ ను మృత్యువు ఒడిలోకి చేర్చింది. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు. మల్లేష్ మృతి పట్ల దాతలు విచారం వ్యక్తం చేస్తున్నారు.తండ్రి కోసం ఎదురుచూసిన చిన్నారి ఆశలు అడియాశలయ్యాయి. పోమాల్ పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మణికంఠుని మందిరానికి రూ. 50వేల విరాళం



**నందిగామ నవంబర్ 20 ప్రభాతవార్త** నందిగామ మండల కేంద్రంలో నూతనంగా పునర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి మేకగూడ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ వార్డు సభ్యుడు సూక్యనాయక్ స్వామి బుధవారం గురుస్వామి గిరీష్ నాయర్ కు రూ.50 వెలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప మందిరానికి తన వంతు ఉడత భక్తిగా ఆర్థిక సహాయం చేసే భాగ్యం కలిగినందుకు తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలోబి.లక్ష్మయ్య యాదవ్, హరిజీవన్, తుమ్మల నర్సింలుయాదవ్,బి.జంగయ్య గౌడ్, చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 1న చలో సికింద్రాబాద్

### నందిగామ మండల మాల మహానాడు నాయకుల పిలుపు

**నందిగామ నవంబర్ 20 ప్రభాతవార్త** వర్గీకరణ పేరిట మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ డిసెంబర్ 1వ తేదీన నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభను మాలల సోదరీ సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నందిగామ మాల మహానాడు సంఘం నాయకులు ఏకుల వెంకటయ్య, దార లింగయ్య, కూడల ప్రభయ్య, దార సురేష్, ఏకుల అంజయ్య, ఏకుల రవికుమార్, బిసా,సాయిబాబు, సల్లరాజు, పబ్బతి కరుణాకర్ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ (ఆదివారం). మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో సభ జరుగుతుందన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ పెద్దలకు తెలిసేలా గల్లీ నుండి ఆరంభం కావాలన్నారు.

## మహిళాలు స్వయం సహాయక సంఘాలలో చేరాలి



**మాడ్గుల, నవంబర్ 20 ప్రభాతవార్త :** మహిళలు స్వయం సహాయక సంఘాలలో చేరాలని సీసీ పోచయ్య పిలుపునిచ్చారు. మాడ్గుల మండల లో ఆర్కపల్లి గ్రామ సంఘం పరిధి లో ఇందిరా మహిళా శక్తి వారోత్సవాలు లో భాగంగా ప్రత్యేక ఈసీ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలు అంశాల పైచర్చించారు. సంఘంలో లేని వారిని గుర్తించి సంఘంలో చేర్పించు ట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు, ప్రమాద భీమా పతకం, రుణ భీమా పతకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి,విద్యార్థిని లకు స్కూల్ యూనిఫామ్‌ల తయారీ,అమ్మ ఆదర్శ పాఠశాల లకు చైర్మన్‌ల ఏర్పాటు, డ్వాక్రా బజార్‌ల ఏర్పాటు, ఎంటర్ ప్రైజెస్ యూనిట్స్ ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు పలు అంశాలపై సమావేశంలో చర్చించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సంఘంలో లేని కొత్త సభ్యలను గుర్తించి బొట్టు పెట్టి సంఘంలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీసీ పోచయ్య,వీఓఏలు యాదగిరి, రాధ, పుష్ప, స్వప్న, రజియా, బిక్కు గ్రామ సంఘం ఈసీ సభ్యులు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Gundammagari Bhrath Reddi R/o. 1-6, Sangiguda (V), Near Hanuman Temple, Shamshabad (M), R.R. Dist, T.G-501218. Changed My Name as "Gundammagari Baraoth Reddy" S/o Srikanth Reddy Gundammagari.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

## ఎంపి ఈటలకు వినతి

**మేడ్చల్, నవంబర్ 20. ప్రభాతవార్త :** రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న జెనెటిక్ మోడిఫైడ్ విత్తనాలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామ శివారులో గల ఎంపీ నివాసంలో సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ జెనెటిక్ మోడిఫైడ్ విత్తనాలతో రైతులు ఎంతో ఇబ్బందికర పరిణామాలు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై రైతుల గొంతుకను పార్లమెంట్‌లో చర్చకు వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దోమ. నవంబర్ 20 ప్రభాతవార్త.** ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా అందుతున్న నిదులను సద్వినియోగం చేసుకొని ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బొంపల్లి గ్రామ కాంగ్రెస్‌పార్టీ నాయకులు అనంతరెడ్డి, నర్సిహ్మరెడ్డి అన్నారు. మండల పరిదిలోని బొంపల్లి గ్రామానికి చెందిన ముద్దం శ్రీనివాస్ కు పర్గి ఎమ్మెల్యే రాంమెహన్‌రెడ్డి ద్వారా మంజురు చేయించిన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కును అందజేశారు. ఈ సందర్బముగ వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందని తెలిపారు. ముద్దం శ్రీనివాస్‌కు మంజురు అయిన 52 వేల చెక్కును బాదితునికి అందజేశారు. ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు బాల్‌రాజ్, మల్‌రెడ్డి, రాము, శేఖర్, ఇంతియాజ్, బాస్కర్, రవేశ్, మహేశ్, యాదయ్య, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో నర్సరీలు ఏర్పాటుకు సిద్ధం చేయాలి



నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపిడివో మహేశ్‌బాబు

**దోమ. నవంబర్. 20 ప్రభాతవార్త.** ప్రభుత్వ స్థలాల్లో నర్సరీలు ఏర్పాటు చేయుటకు సిద్ధం చేయాలని దోమ మండల పరిషత్ అబివృద్ధి అదికారి మహేశ్‌బాబు అన్నారు. బుదవారం నాడు దోమ మండల పరిదిలోని ఉట్‌పల్లి గ్రామములో కొత్త నర్సరీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ 2024.25 సంవత్సరమునకు 36 గ్రామ పంచాయతీల్లో మూడు లక్షల తొబ్బైఆరువేల మెక్కలను పెంచేందుకు నిర్ణయించడము జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేయుటకు ఉపాదిహామి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శ్రద్ద తీసుకొని నర్సరీలను పెంచుటకు కృషి చేయాలని అన్నారు. అనంతరం ఉట్‌పల్లి, తిమాయపల్లి అంగన్‌వాడి, సర్వేల సెంటర్లను పరిశీలించారు.

## రైతులను ఒప్పించి రైతుల అంగీకారంతోనే భూములు తీసుకుంటాం..

**ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



రైతులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**దుద్యాల్, నవంబర్ 20, ప్రభాత వార్త:** ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు కలెక్టర్ ఇతర జిల్లా అధికారులు వస్తే కుట్రపూరితంగా దాడులు చేపించి అమాయక ప్రజలను జైలు పాలు కారకుడయ్యాడని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లురవి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో ఫార్మా బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయంలో రైతులను తప్పుదోవ పట్టించి కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి చేయనివ్వకుండా అడ్డుకునే కుట్రను కేటీఆర్ ప్రణాళిక రచించి ఇక్కడి అమాయక రైతులను ఉసిగొలిపి అధికారులపై దాడులు చేపించారని అన్నారు. ప్రణాళిక ప్రకారం అధికారులపై దాడులు చేపించిందే కాకుండా ఢిల్లీకి వెళ్లి ముఖ్యమంత్రిపై అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. కేటీఆర్ వ్యవహారం భార్య మొగుణ్ణి కొట్టి మొత్తుకుంటున్నట్లు ఉందన్నారు. విషపూరితమైన ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని కొంతమంది టిఆర్ఎస్ గుండాలు రైతులకు అపోహ కలిగించారన్నారు. దుద్యాల మండలంలోని లగచర్ల హకీంపేట్ పోలేపల్లి రోటి బండ తండా పులిచెర్లకుంట తండాల పరిధిలో విషపూరితమైన ఫార్మా కంపెనీ కాకుండా గ్రీన్ ఫార్మా అంటే పరిశోధన ఫార్మా కంపెనీ మాత్రమే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దానితోపాటు ఎలక్ట్రికల్స్‌కు సంబంధించి మరికొన్ని కంపెనీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దుద్యాల మండలంలోని దాదాపుగా 15 వేల కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నా రన్నారు. ఇక్కడి నిరుద్యోగులకు వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వాటిని కొడంగల్ ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అధికారులపై దాడి కేటీఆర్ కుట్రనే ఈనెల 11న లగచర్లలో అధికా రులపై జరిగిన దాడి పూర్తిగా కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిలు రచించిన కుట్రను సురేష్ పథకం ప్రకారం కలెక్టర్ ను, ఇతర అధికారు లను గ్రామానికి రప్పించి దాడి చేపించాడని పేర్కొన్నారు. ప్రభుత్వంను బద్నాం చేయడానికి ముఖ్యమంత్రి పై వ్యతిరేకత తీసుకురావడానికి కేటీఆర్ ఇదంతా చేపించాడని రైతులకు వివరించారు.

# అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై శిక్షణ

**బొంరాస్‌పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం తాండూర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం. సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ వారి ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు పై బొంరాస్ పెట్ మండలంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ అధిక సాంద్రత పత్తి ఆవశ్యకత ు రైతులకు వివరించారు. ఈ పద్ధతిలో సాగుకు తేలికపాటి నేలలు చాలా అ ుకూలమని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా పత్తి దిగుబడి నిలకడగా ఉందని, దీనిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు సూచించారు. సాధారణ పత్తి సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉందని వివిధ దశల్లో పత్తి తీయడం రైతులకు భారంగా ఉందని వివరించారు. అధిక సాంద్రతలో యాంత్రికరణతో పత్తి విత్తుకోవచ్చని, దీని వలన విత్తనాలు సరైన లోతులో విత్తడం వలన మొలక మంచిగా వస్తుందని, అలాగే సరైన దూరం వరసల మొక్కల మధ్యన 90 ?? 15 సెంటీ మీటర్ల దూరంతో విత్తుకోవచ్చని వివరించారు. అధిక సాంద్రత పత్తిలో చేపట్టాల్సిన కలుపు యాజమాన్యం, పెరుగుదల నియంత్రణ మందుల గురించి వివరించారు. ఎరువుల మోతాదు, నీటి యజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త యమున అధిక సాంద్రత పత్తిలో ఆశించే తెగుళ్ళైన వేరు కుళ్ళు తెగులు, ఎండు తెగులు, తలమాడు తెగులు అలాగే వివిధ రకాల ఆకుమచ్చ తెగుళ్ళ లక్షణాలు, వాటి యజమాన్య చర్యల ు రైతులకు వివరించారు. తర్వాత వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుజాత మాట్లాడుతూ పత్తిలో అధిక సాంద్రత సాగుపై ప్రత్యేక ప్రాజెక్టు జరుగుతుందని, దీనిలో భాగంగా వికారాబాద్ జిల్లాలో నాలుగు డివిజన్లోని వివిధ గ్రామాలలో కొందరు రైతుల పొలాలలో క్షేత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. తర్వాత అధిక సాంద్రత పత్తికి అ ువైన రకాల గురించి అధిక సాంద్రత పద్ధతిలో పంట కాలం త్వరగా పూర్తయి జనవరి మాసంలో రెండో పంటగా పెసర, మి ుములు వేసుకొని రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు వివరించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త పరిమళ మాట్లాడుతూ పత్తిలో వాడాల్సిన లింగాకర్షణ బుట్టల గురించి వాటిని పొలాలలో ఏ విధంగా అమార్చుకోవాలని వివరించారు. ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవడం ద్వారా మగ పురుగులు ఆకర్షితమై బుట్టలో పడటం వలన, పురుగుల ఉధృతి తెలుసుకొని సరైన యజమాన్య చర్యల ు సరైన సమయంలో చేపట్టలని మరియు రైతులకు అధిక సాంద్రత పత్తి అ ువైన రకాల గురించి, వాటి గుణగణాల గురించి రైతులకు తెలియజేశారు. అధిక సాంద్రత ప్రత్తిలో, సాధారణ పత్తితో పోలిస్తే మొక్కల సంఖ్య అధికంగా ఉండటం వలన అధిక దిగుబడి పొందవచ్చని తెలియజేశారు. అలాగే అధిక సాంద్రత ప్రత్తి పైన రైతులు అవగాహన పెంచుకోవాలని, తప్పకుండా పాటించాలని రైతులకు సూచించారు. రైతులు అడిగిన వివిధ సందేహాలకు శాస్త్రవేత్తలు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామల రైతులు, శాస్త్రవేత్తలు మరియు గ్రామ అధికారులు పాల్గొన్నారు.



సమావేశం లో పాల్గొన్న రైతులు



## లగచర్లకు బయలు దేరిన గిరిజన నాయకులు

**కడ్తాల్ నవంబర్ 20, ప్రభాత వార్త:**

లగచర్లలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు కల్వకుర్తి నియోజకవర్గం నుండి కడ్తాల్, ఆమనగల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల నుండి మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు లగచర్లకు బయలుదేరారు. అల్లుడి స్వలాభం కోసం అమాయకపు గిరిజనుల నుండి భూములు లాక్కోవడానికి గిరిజనులపై అక్రమ కేసులు పెట్టి అనేక రకాల ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మానుకొని గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకొని వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరుగుతున్న గిరిజనులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మొన్న లగచర్లలో ఎస్టీ కమిషనర్ బృందం పర్యటిస్తే వారిని కల్వకుండా పోలీసులు అడ్డుకున్నారని, అన్యాయం పై ప్రశ్నిస్తే అమాయకపు గిరిజనులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. లగచర్లలో గిరిజనులపై జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్రస్థాయి గిరిజన మంత్రులు, నాయకులు, గిరిజన సంఘాలు స్పందించాలని కోరారు. రేవంత్ సర్కార్ గిరిజనులపై ఇదే రకమైన ధోరణి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా రోజుకొక విధంగా నిరసనలు దీక్షలు చేపడతామని హెచ్చరించారు. లగచర్లలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకునేందుకు వారిని కలవడానికి బుధవారం కడ్తాల్ నుండి గిరిజన నాయకులు బయలుదేరారు. ఈ కార్యక్రమం లో మాడుగుల మాజీ ఎంపీపీ జైపాల్ నాయక్, ఆమనగల్ మాజీ జెడ్పిటిసి అనురాధ పత్య నాయక్, మాజీ ఎంపిటిసి నాగులు, మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్, పిఏసిఎస్ డైరెక్టర్ సేవ్య నాయక్ మాజీ సర్పంచ్లు తులసి రామ్ నాయక్ లోకేష్ నాయక్ హరిచంద్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ రమణ, శారద పాండు, మాజీ డైరెక్టర్ రమేష్, మాజీ వార్డు సభ్యులు సౌజన్య రాజు నాయక్, శ్రీను నాయక్ అంజి నాయక్ మోతిలాల్ నాయక్ శ్రీను నాయక్ జగన్ సక్రు నాయక్ నాయకులు తదితరులు బయలుదేరారు.

## అన్ని దానాల కంటే గొప్పది అన్నదానం

**లైన్స్ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి**

**కడ్తాల్, నవంబర్ 20, ప్రభాత వార్త:** మానవసేవే మాధవ సేవ అని, అన్ని దానాల కంటే గొప్పది అన్నదానమని లైన్స్ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ జి. చెన్న కిషన్ రెడ్డి అన్నారు. కడ్తాల పట్టణానికి చెందిన కీర్తిశేషులు శ్రీ గంప విశ్వనాథం గుప్తా గారి 28వ వర్ధంతి సందర్భంగా ఆమనగల్లు లైన్స్ క్లబ్, కడ్తాల్ లియో క్లబ్ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని శ్రీ కీర్తిశేషులు విశ్వనాథం గారి కుటుంబ సభ్యులైన డిసిసిబి డైరెక్టర్, లయన్ గంప వెంకటేష్ గుప్తా, లయన్ శ్రీనివాస్ గుప్తా లతో కలిసి జి చెన్న కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందని పెద్దలు చెబుతుంటాన్నారు. ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు బాటసారులకు ప్రయాణికులకు ఆకలి తీర్చడమే మానవునికి దేవుడిచ్చిన గొప్ప వరం అని అన్నారు. కులమతాల కంటే గొప్పది మానవత్వం అని దాన్ని మించిన మరో పదం లేదన్నారు. సేవా కార్యక్రమాలకు ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా గంప విశ్వనాథం గారి కుటుంబ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 400 మంది వరకు అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, గంప శ్రీనివాస్ గుప్తా, లైన్స్ క్లబ్ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, మహేష్, బిచ్య నాయక్, చేగురి వెంకటేష్, కుమార్, సురేష్, మహేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శతచండీ హోమం



**కడ్తాల్, నవంబర్ 20, ప్రభాతవార్త:** మైసిగండి మైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం అమ్మ వారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేసి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ శతచండీ హోమం, పూర్ణాహుతి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేసి విశేష పూజలు, నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో గావించారు. శతచండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని కొబ్బరి, మామిడి తోరణాలతో వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో శోభయ మానంగా అమ్మవారిని అలకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుం టున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ శిరోలి వంతునాయక్, ఈఓ స్నేహ లత, తహసీల్దార్ జ్యోతి, టీ పీసీసీ సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, లక్ష్మమ్మ, పద్మశ్రీ, ట్రస్ట్ సభ్యులు రామావత్ భాస్కర్, అరుణ్, యాట నరసింహ, గీత, జోహర్ లాల్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మాదరం యాదగిరి, ఆనంద్, భాను ప్రకాష్, అమూల్యపాటి, సిబ్బంది చంద్రయ్య, రాములు, కృష్ణ, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



బాలకృష్ణను సన్మానించిన మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, తదితరుల దృశ్యం

## విశ్వకర్మ జాతీయ స్థాయి అవార్డు గ్రహీతకు సన్మానం

**శామీర్‌పేట, నవంబరు 20, ప్రభాతవార్త**

విశ్వకర్మ సమాజానికి సేవలు అందించి జాతీయ స్థాయి అవార్డును పొందిన వర్కోజి బాలకృష్ణను స్వగ్రామం కొల్తూర్‌లో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మాజీ వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆయనను ఘనంగ సన్మానించి అభినందించారు. మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామంలో విశ్వకర్మ జాతీయ స్థాయి అవార్డును అందుకున్న వర్కోజి బాలకృష్ణను పలువురు సన్మానించి అభినందనలు తెలియజేశారు. విశ్వకర్మ సమాజానికి విశిష్ట సేవలు అందించిన బాలకృష్ణను జాతీయ స్థాయిలో గుర్తించి విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బాలకృష్ణకు విశ్వకర్మ జాతీయ స్థాయి అవార్డును అందజేసిన సంగతి తెలిసిందే. కొల్తూర్ గ్రామానికి చెందిన బాలకృష్ణకు జాతీయ స్థాయిలో అవార్డు రావటం ప్రశంసనీయమని, విశ్వకర్మ సమాజానికి ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందటం అభినందనీయమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మాజీ వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సేవా గుణంను అలవాటు చేసుకుని ప్రజాసేవలో రాణించాలని వారు ప్రజలకు చైర్మన్ నర్సింలు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డిలు సూచించారు. అందరు కూడ జాతీయ స్థాయి అవార్డు పొందిన బాలకృష్ణను ఆదర్శంగ తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు అనంతరెడ్డి, బి.వెంకటేశ, మాజీ సర్పంచు నల్ల శిల్పయాదగిరి, మాజీ ఉపసర్పంచు పి.జైపాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, గురువయ్య, నర్సారెడ్డి, తిరుపతిరెడ్డి, చంద్రయ్య, కిషన్, నవీన్‌చారి, భూపాల్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శామీర్‌పేటలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**శామీర్‌పేట, నవంబరు 20, ప్రభాతవార్త** మండల కేంద్రం శామీర్‌పేటలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని శామీర్‌పేట విద్యుత్ సెక్షన్ ఎఇ రాఘవేందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పేర్కొంటూ శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఎన్‌టిఆర్‌ఒ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అంతరాయం కల్గుతుందన్నారు. దీంతో శామీర్‌పేట సమీపంలోని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, నల్సార్ లా యూనివర్సిటీ, ఎన్‌టిఆర్‌ఓ ఏరియా, ఎంపిడిఓ ఆఫీస్, సిలబ్రిటీ రిసార్ట్సు, పెద్దమ్మ కాలనీ ఏరియా, మెయిన్‌రోడ్డు పలు ప్రాంతాల వారికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## సమగ్ర సర్వేలో అధికారులు, సిబ్బంది బిజీబిజీ

**శామీర్‌పేట, నవంబరు 20, ప్రభాతవార్త** శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల్లో, మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో, తూంకుంట మున్సిపాల్టీలోని వివిధ గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నందున సంబంధిత అధికారులు, సిబ్బంది అందరు కూడ బిజీబిజీగ ఉంటున్నారు. దీంతో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయాలు, తూంకుంట మున్సిపల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది లేక వెలవెలబోతున్నాయి. సంబంధిత అధికారులు, సిబ్బంది అందరు కూడ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో నిమగ్నమయ్యారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టటానికి ఈ నెల 6వ తేదీ నుంచి 8వరకు ఇంటింటా ఎన్యుమరేటర్లు పర్యటించి ఇళ్లను గుర్తించి సర్వే కోసం ఇళ్లకు స్టిక్కర్లు అంటించటం జరిగింది. ఇక ఈ నెల 9వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించి సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్వహించటం జరుగుతుంది. ఏ అధికారిని, ఏ సిబ్బందిని అడిగినా సర్వేలో ఉన్నామని సమాధానం ఇవ్వటం జరుగుతుంది. ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది అందరు కూడ సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. సర్వేను ఎన్యుమరేటర్లు నిర్వహిస్తుండగ, సూపర్‌వైజర్లు పర్యటించి సర్వేను పరిశీలిస్తున్నారు. మండల, మున్సిపల్ అధికారులు కూడ గ్రామాల్లో, వార్డులలో పర్యటిస్తూ సమగ్ర సర్వేను పరిశీలిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ వరకు సర్వే కొనసాగునుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నప్పటికీ మరి కొన్ని రోజులు అదనంగ సమయం పట్టే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఒక ఇంటికి అరగంట నుంచి గంట వరకు సర్వే చేయటానికి 56 అంశాల వివరాలు సేకరించటానికి సమయం పడుతుందని పలువురు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అంగన్‌వాడి టీచర్లను, డ్వాక్రా సంఘాల సమాఖ్య వారిని, ఔట్‌సోర్సింగ్ వారిని కూడ సర్వే పనులు అప్పగించారు.

## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ: సీఐ

**ఘట్‌కేసర్, నవంబర్ 20, ప్రభాతవార్త:** సీసీ కెమెరాలు ఏర్పాటు ద్వారా దొంగతనాలు నివారించవచ్చని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో బుధవారం ఆయన సిసి కెమెరాలను ప్రారంభించారు. ఆలయ పరిసరాల్లో 8 కెమెరాలు ఏర్పాటు చేయగా సీఐ పరశురాం సహకరించిన ఆలయ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. సెఫ్టీ, సెక్యూరిటీ దృష్ట్యా మిగతా అన్ని దేవాలయాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, ఆలయ సభ్యులు వెంకట్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ప్రజాపాలన కళాయాత్ర చేపట్టిన దృశ్యం

## గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజాపాలన కళాయాత్ర కార్యక్రమాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు- 2024లో భాగంగ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారధి, కళాకారుల బృందాలు కళాయాత్ర కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించారు. బుధవారం మేడ్చల్ జిల్లాలో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగ కళాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాటల ద్వారా ప్రజలకు కళాకారులు వినిపించారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లోని బాలానగర్, ఫిరోజ్‌గూడ, బబ్బుగూడ ప్రాంతాలలో, కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని అహ్మద్‌గూడ్, హరిదాస్‌పల్లి, చీర్యాల గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పాటలతో ప్రచారాన్ని నిర్వహించారు. జిల్లాలో రెండు కళాకారుల బృందాలు వేరువేరుగా పాల్గొని మూడు గ్రామాల, ప్రాంతాల చొప్పున ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటల ద్వార ప్రజలకు వివరిస్తున్నారు.

## బొంరాస్‌పేట మండలంలో టీచర్ల అక్రమ డిప్యుటేషన్

**బొంరాస్‌పేట్, నవంబర్ 20, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పాఠశాలలకు ఇటీవల బదిలీపై ఉరెనికితండా, ఎన్కేపల్లి, బొంరాస్ పేట జడ్పీఎచ్ఎస్ పాఠశాలలకు చెందిన నవ్య, శ్రీనివాస్, అర్చన రెడ్డి ఉపాధ్యాయులు వచ్చారు. ఇక్కడి నుండి వెళ్లేందుకు పైరవీలు చేసి గతంలో పనిచేసిన పాఠశాలలకు బదిలీ చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆయా పాఠశాల స్థానికులు చర్చించుకుంటున్నారు. హైదరాబాదులోని డీఎస్సీ కార్యాలయం నుండి బదిలీ ఆర్డర్ కాపీ తీసుకువచ్చి మండల పరిధిలో విద్యా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించేందుకు వచ్చి అక్రమంగా డిప్యూటేషన్ పై వెళ్లేందుకు ప్రయత్నించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. ఉరెనికి తాండ పాఠశాలలో ఏకోపాధ్యాయురాలు ఉండడంతో అక్రమంగా డిప్యూటేషన్ పై వెళ్లడంతో పాఠశాల మూతపడే అవకాశం ఉందని, ఇప్పటికైనా పై అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులు

**ఘట్‌కేసర్, నవంబర్ 20, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంభికాసమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య జలాదివాసం, ధాన్యాధివాసం తదితర పూజలు చేసి గణపతి, శివలింగం, నాగదేవత, నందిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కంట్లం వంశస్తుల ఆధ్వర్యంలో నాగదేవత దేవాలయ నిర్మాత అంబారీపేట వరదరాజులు పర్యవేక్షణలో మూడురోజులుగా ప్రతిష్ఠా పూజలు జరిగాయి. విగ్రహ దాతలు కన్నూరి రమేశ్‌కుమార్, సునీత దంపతులు హోమాలు, ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్బంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేసిన అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీశంకర్, శివకుమార్, అర్చకులు శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్బంగా భ్రమరింబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి చౌదరిగూడకు చెందిన ముద్దం ఈశ్వరయ్యయాదవ్ ఆధ్వర్యంలో రూ.40,000లు విరాళంగా అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆలయాభివృద్ధికి సహకా రం అందించాలని ధర్మకర్త గౌరీశంకర్ కోరారు.

## మృతుని కుటుంబానికి చైర్‌పర్సన్ ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, నవంబర్ 20, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన కోరుబోతు ఆగేశ్ ముదిరాజ్ కుటుంబానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ రూ.5 వేలు ఆర్థికసాయం చేశారు. ఆగేశ్ మృతదేహంపై చైర్‌పర్సన్ పూలమాళ వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆమె అందజేశారు. పేదకుటుంబాలకు అండగా నిలచి తోచిన సాయం అందించడానికి దాతలు ముందుకు రావాలని ఆమె సూచించారు. మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు-మాజీ వార్డుసభ్యులు కోరుబోతు నాగరాజు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## 23న సిఆర్‌పిఎఫ్ పాఠశాలలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త**

ఈ నెల 23న హకీంపేట్ సమీపంలోని సిఆర్‌పిఎఫ్ పాఠశాలలో మేడ్చల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు అండర్-8,10,12 బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ డి.అపర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేసి డిసెంబరు 1న మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు క్రీడాకారులు తమ బర్త్ సర్టిఫికెట్స్‌తో 23న ఉదయం 8గంటలకు సిఆర్‌పిఎఫ్ క్రీడా ప్రాంగణంలో రిపోర్టు చేయాలని ఆయన కోరారు.

## ఎంపి ఈటలను కలిసిన జిల్లా బికెఎస్ రైతులు

శామీర్‌పేట, నవంబరు 20, ప్రభాతవార్త

రానున్న పార్లమెంట్ సమావేశాల్లో జెనెటిక్ మోడిఫైడ్ (జిఎం) విత్తనాల గురించి చర్చించాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను అఖిల భారత కిసాన్ సంఘ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, పలువురు బికెఎస్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం ఉదయం శామీర్‌పేట సమీపంలోని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంకు వెళ్లి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిఎం విత్తనాలపై రైతుల వాణిని పార్లమెంట్‌లో వినిపించాలని వారు ఎంపి ఈటల రాజేందర్‌ను కోరారు. జిల్లా అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతు నాయకులు బికెఎస్ నాయకులు కలిసి ఆయనను కోరారు. జిఎం విత్తనాల వల్ల రైతులపై పడే ప్రభావాల గురించి పార్లమెంట్‌లో చర్చించాలని వారు కోరారు. రైతుల సమస్యలు, జిఎం విత్తనాలు ప్రభావాలు, వాటి వల్ల పంటలపై వచ్చే పరిణామాలు వంటి అంశాలపై చర్చించాలని ఆయనను వారు కలిసి కోరారు. పలువురు రాష్ట్రం నుంచి, జిల్లా నుంచి, మండల స్థాయి రైతు ప్రతినిధులు కలిసి విన్నవించారు.

